ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
3 జిల్లా వార్తలు
శుక్రవారం 10 జనవరి 2025



విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఉత్తమ ఫలితాలు సాధించాలి

» కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో 10కి పది పది గ్రేడ్ పాయింట్లు సాధించడమే లక్ష్యంగా చదవాలని కలెక్టర్ నారాయణరెడ్డి విద్యార్థులకు సూచించారు. గురువారం ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడ గ్రామంలోని షెడ్యూల్ కులాల బాలుర వసతి గృహంలో విద్యార్థులకు దుప్పట్లు, నోట్ బుక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో చదివిన ఎందరో మేధావులుగా, రాజకీయ వేత్తలుగా, ఉన్నతాధికారుగా ఎదిగారని పేర్కొన్నారు. విద్యార్థులు మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని, వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. లక్ష్యం చేరే వరకు విశ్రమించకూడదని, అందుకు అనుగుణంగా కార్యచరణ రూపొందించుకోవాలన్నారు. విద్యార్థులకు చదువు, నిబద్ధత ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న డైట్ చార్జెస్ మార్పు, డైట్ మెనూ గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, ఇబ్రహీంపట్నం తహసీల్దార్ సునీతా రెడ్డి, మంచాల తహసీల్దార్ ఎంవీ ప్రసాద్‌రావు, హాస్టల్ స్పెషల్ ఆఫీసర్ సాధన, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ ఆఫీసర్ కుసుమల లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల ధరలకు రెక్కలు

ఏడాది ఆరంభంలోనే అన్నదాతలకు షాక్

బస్తాకు రూ.100కు పైగా పెంపు

డీఏపీపై రూ.300 పెంపునకు నిర్ణయం


యాసంగి సీజన్‌పై అన్నదాత ఆందోళన

పలు చోట్ల ఎరువుల కృత్రిమ కొరత

ప్రభుత్వాల సబ్సిడీపై రైతుల ఆశలు

పెట్టుబడి సాయానికి తప్పని ఎదురుచూపు

అసలే పెట్టుబడి భారం పెరిగి సతమతమవుతున్న అన్నదాతలకు కొత్త ఏడాది ఆరంభంలోనే పెరిగిన ఎరువుల ధరలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. గడిచిన వారం రోజుల్లో ధరలు పెరగడంతోపాటు ఉమ్మడి జిల్లాలో కొరత మొదలైంది. దీంతో యాసంగి సాగు చేస్తున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిసరుకుల ధరలు పెరిగాయంటూ ఎరువుల తయారీ కంపెనీలు అకస్మాత్తుగా ఎరువుల ధరలు పెంచేందుకు సిద్ధమయ్యారు. దీనికి ముందుగానే వ్యాపారులు కొంత మేర ధరలు పెంచేశారు. మరికొందరు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు.





(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): ఉమ్మడి జిల్లాలో యూరియాతో పాటు 20:20:0:15, 14:35:14 కాంప్లెక్స్ ఎరువుల ధరలు ఈ ఏడాది ఆరంభం నుంచి పెంచేశారు. ఈ ఎరువులన్నీ బస్తాకు రూ.100 చొప్పున పెంచి అమ్ముతున్నారు. ఇదిలా ఉంటే డీఏపీ ధరను గణనీయంగా పెంచేందుకు ఎరువుల కంపెనీలు సిద్ధమయ్యాయి. బస్తాకు రూ.300 వరకు పెంచాలని కంపెనీలు ఇప్పటికే నిర్ణయించాయి. ఈ భారం తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొంత మేర సబ్సిడీ ఇచ్చే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే కొత్త ధర అమల్లోకి రాక పోయినప్పటికీ వ్యాపారులు మార్కెట్‌లో కొన్ని చోట్ల కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. పలు చోట్ల యూరియా, డీఏపీ సరఫరా తక్కువగా ఉంది. సాధారణంగా వానాకాలం, యాసంగి సీజన్‌లలో ప్రతీ పంటకు ఎకరానికి సగటున రెండు బస్తాల కాంప్లెక్స్ ఎరువుల్ని రైతులు వినియోగిస్తుంటారు. అయితే రైతులు వినియోగించే ఈ ఎరువుల

మిగతా 5వ పేజీలో...

యాసంగి సీజన్‌లో ఎరువుల వినియోగం (జిల్లాల వారీగా మెట్రిక్ టన్నుల్లో)

వికారాబాద్	28,260
రంగారెడ్డి	28,293
మేడ్చల్	2,500

ఉమ్మడి జిల్లాల్లో ఎరువుల ధరలు (బస్తా)

ఎరువు	వానాకాలం	యాసంగి
20:20:0:15	రూ.1,200	రూ.1,300
14:35:14	రూ.1,700	రూ.1,800
యూరియా	రూ.265	రూ.300
డీఏపీ	రూ.1,350	రూ.1,350 (రూ.300 పెంచేందుకు నిర్ణయం)



ఉత్తరద్వార పంటపాన్ని సమీక్షిస్తున్న బక్కని నర్సింహులు

వైకుంఠ ఏకాదశికి సర్వం సిద్ధం

» ముస్తాబైన షాద్‌నగర్ వేంకటేశ్వరాలయం



సిద్ధమైన ఉత్తర ద్వారం

షాద్‌నగర్ అర్బన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని షాద్‌నగర్ వేంకటేశ్వర ఆలయం ముస్తాబైంది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే ఉత్తర ద్వార దర్శనం చేసుకునే భక్తుల కోసం మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు నేతృత్వంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. గర్భగుడి మండపం ఉత్తరం వైపు ఉత్సవ విగ్రహాలను పెట్టి పూజలు చేశారు. భక్తులు దర్శించుకునేలా మండపాన్ని పూలతో అలంకరించారు. ఉత్తర ద్వారం, ఆలయ గర్భగుడి ద్వారాలకు స్థానిక వ్యాపారి ఆకుల వెంకటేశం కుమారుడు, దివంగత రాఘవేందర్‌గుప్త జ్ఞాపకార్థం నూతన తలుపులను ఏర్పాటు చేసి, ఇత్తడి తొడుగులతో అధునీకరించారు. భక్తులకు ప్రసాదాల పంపిణీకి ఏర్పాట్లు చేశారు. చటాన్‌పల్లికి చెందిన నందారం అశోక్‌యాదవ్ సహకారంతో ఆలయ గర్భగుడులను, ద్వారాలను పూలతో అలంకరించారు. క్యూలైన్ కోసం సీఎంఆర్ యాజమాన్యం బారికేడ్లు సమకూర్చింది. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు పలబట్ల బాల్‌రాజ్‌గుప్త, పరిగి సాయిశ్వర్‌రెడ్డి, ఒగ్గు కిషోర్, కానుగు రాంభూపాల్, అంతయ్య, భిక్షపతి, మధు పాల్గొన్నారు.



ఎండీ బషీర్, అధ్యక్షుడు



అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి



బాలస్వామి, కోశాధికారి

ఎస్‌ఎల్‌టీఏ సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

కందుకూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ రంగారెడ్డి జిల్లా కమిటీని ఎన్నుకున్నట్లు ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు చక్రవర్తుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కర్రె గౌరీశంకర్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం ఆన్‌లైన్‌లో ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ ఎండీ బషీర్(నేదునూరు), ప్రధాన కార్యదర్శిగా బండారి అనీల్‌కుమార్(సుభాన్‌పూర్), కోశాధికారిగా బి.బాలస్వామి (తుమ్మలూరు), మహిళా కార్యదర్శులుగా కళావతి, విజయలక్ష్మి, కవితారెడ్డి, రాజేశ్వరి, అశ్విని, సంయుక్త కార్యదర్శిగా కేశవులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గౌరీశంకర్ మాట్లాడుతూ భాషోపాధ్యాయుల హక్కుల సాధనకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆ సంస్థ న్యాయాధికారి జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.



కుర్మిద్ద తండాలో ఫ్యూచర్ సిటీ రోడ్డు కోసం భూమిని పరిశీలిస్తున్న అధికారులు

బందోబస్తు మధ్య హద్దుల గుర్తింపు

ఫ్యూచర్ సిటీకి రెవెన్యూ అధికారుల రోడ్డు సర్వే

చెప్పకుండా వచ్చారని పలువురు రైతుల ఆవేదన

144.7 ఎకరాల్లో సాఫీగా సాగిన సర్వే



సర్వే చేయొద్దని ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు

యాచారం జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఫ్యూచర్ సిటీ కోసం రోడ్డు నిర్మాణానికి పోలీస్ బందోబస్తు మధ్య రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. స్థానికులు సర్వేను అడ్డుకుంటారని భావించిన రెవెన్యూ అధికారులు భారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి సర్వే పూర్తి చేశారు. గురువారం యాచారం మండలంలోని కుర్మిద్ద తండా మీదుగా కడ్తాల్ మండలంలోని ఆకుతోటపల్లి, ఆమనగల్లు గ్రామాల వరకు రోడ్డు సర్వే చేశారు. కుర్మిద్దతండా, కుర్మిద్ద గ్రామాలకు చెందిన 529 మంది రైతులకు చెందిన 144 ఎకరాల 7 గుంటల భూమిని సర్వే చేసి హద్దులు గుర్తించారు. ఇప్పటికే ఫార్మాసిటీ కోసం సేకరించిన 311 సర్వే నంబర్‌లో ప్రస్తుతం వేరుశనగ, కంది, పత్తి తదితర పంటలున్నాయి. సర్వేకు వస్తున్నట్లు తమకు ఎందుకు చెప్పలేదని కుర్మిద్దతండాకు చెందిన పలువురు గిరిజన రైతులు అధికారులతో

మిగతా 6వ పేజీలో...

నూతన ప్రాజెక్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రంగారెడ్డి అర్బన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల ఉన్నతికి పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థల నుంచి నూతన ప్రాజెక్టుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమాధికారి రామేశ్వరి గురువారం ప్రకటనలో తెలిపారు. ఎన్‌జీవోస్, వలంటరీ ఆర్గనైజేషన్, గిరిజనుల ఉన్నతి కోసం పని చేస్తున్న సంస్థల నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు.



కొత్తూర్ పారిశ్రామిక వాడలో కార్మికులు

కష్టాల కడలిలో కార్మికులు!

కనీస వసతులు లేక అవస్థలు

తాగునీరు, మరుగుదొడ్లు లేని దుస్థితి

శిథిల ఇళ్లు, రేకుల షెడ్లే ఆవాసాలు

తనిఖీలు లేక యాజమాన్యాల ఇష్టారాజ్యం

కొత్తూరు పారిశ్రామికవాడలో 35వేల మంది కార్మికులు

కొత్తూర్, జనవరి 9:(ఆంధ్రజ్యోతి): మండుతున్న యంత్రాల మధ్య పనిచేసే కార్మికుల బతుకులు నేటికీ దుర్భర స్థితిలో కొట్టుమిట్టాడుతూనే ఉన్నాయి. కనీస సౌకర్యాలైన విశ్రాంతి గదులు, అంబులెన్స్, ట్రాన్స్‌పోర్టు, పక్కా గృహాలు, మహిళా కార్మికులకు భద్రత, మరుగుదొడ్లు, తాగు నీటి సౌకర్యాలు కల్పించడంలో పారిశ్రామికవేత్తలు విఫలమవుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమానికి ఎన్నో చట్టాలు రూపొందించినప్పటికీ వాటిని పారిశ్రామికవేత్తలు ఆచరణలో పెట్టడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. పారిశ్రామికవేత్తలు కార్మికుల హక్కులను కాలరాస్తూ, చట్టాలను ఉల్లంఘిస్తున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడని కార్మిక సంఘాల నాయకులతోపాటు, కార్మికులు ఆరోపిస్తున్నారు.

కొత్తూర్ పారిశ్రామికవాడ...

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కొత్తూర్ సమీపంలో 1976 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం పారిశ్రామికవాడను ఏర్పాటు చేసింది. ప్రభుత్వం రాయితీలు కల్పించడంతో పలువురు పారిశ్రామికవేత్తలు తరలివచ్చి పలు పరిశ్రమలు ఏర్పాటు చేశారు. కొత్తూర్ పారిశ్రామికవాడతోపాటు కొత్తూర్ మండలంలోని తిమ్మాపూర్, కొడిచర్ల, పెంజర్ల, ఇన్ముల్‌నర్వ, నందిగామ మండలంలోని రంగాపూర్, మేకగూడ, చేగూర్

మిగతా 6వ పేజీలో...



శిథిలావస్థకు చేరిన కార్మికుల క్వార్టర్లు

ఎకరానికి రూ. 2 కోట్లు ఇవ్వాలి

» ఫోర్త్‌సిటీలో భూములు కోల్పోతున్న లేమూరు రైతుల డిమాండ్



మాట్లాడుతున్న భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ రాజు, ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

కందుకూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఫోర్త్ సిటీలో ల్యాండ్ పూలింగ్ కింద ఎకరానికి పరిహారంగా 1750గజాల ప్లాట్‌ను అన్ని హంగులతో అభివృద్ధి చేసి ఇవ్వాలని, లేదా ఎకరాకు రూ.2కోట్ల పరిహారం ఇవ్వాలని లేమూరు రైతులు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మండలంలోని మీర్ఖాన్‌పేటలో ఏర్పాటు చేస్తున్న ఫోర్త్‌సిటీ వరకు 330 ఫీట్ల వెడల్పుతో నిర్మించనున్న రోడ్డుకు భూములు కోల్పోతున్న రైతులతో గురువారం ఆర్డీవో కార్యాలయంలో భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ రాజు, ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి లేమూరు రెవెన్యూ రైతులతో సమావేశమయ్యారు. రావిరాల ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ 13 నుంచి మండలంలోని మీర్ఖాన్‌పేట వరకు 18 కిలో మీటర్ల మేరకు నిర్మించనున్న రోడ్డుకు లేమూరు, తిమ్మాపురం, రాచులూరు, మీర్ఖాన్‌పేట, గుమ్మడవెల్లి, పంజగూడ రెవెన్యూ గ్రామాలకు చెందిన రైతులు భూములు కోల్పోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం గురువారం రైతుల అభిప్రాయాలు సేకరించడానికి ముందుగా లేమూరు రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ల్యాండ్ పూలింగ్‌లో ఎకరం కోల్పోయే రైతుకు 1750 గజాల ప్లాట్‌ను అన్ని హంగులతో అభివృద్ధి చేసి ఇవ్వాలని, లేదా ఎకరాకు రూ2 కోట్ల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ కలెక్టర్, ఆర్డీవో మాట్లాడారు. రైతులు సలహాలు, సూచనలను ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. ఈ నెల 17న మీర్ఖాన్‌పేట, 18న తిమ్మాపురం, 20న రాచులూరు, 21న లేమూరు 22న గుమ్మడవెల్లి, పంజగూడ గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు గ్రామ సభ ఉంటుందని, అనంతరం అవార్డును ప్రకటించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆర్ఐలు యాదగిరి, శ్రీకాంత్, రైతులు ఢిల్లీ గణేశ్, ఎస్.కృష్ణవేణి, ఢిల్లీ రమేశ్, వెల్బూరి అనురాధ, కస్తూరి, సుధాకర్‌రెడ్డి, తాళ్ల కృష్ణగౌడ్ పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

» డీపీవో సురేశ్‌మోహన్



నర్సరీని పరిశీలిస్తున్న డీపీవో సురేశ్‌మోహన్

షాద్‌నగర్‌రూరల్, జనవరి9(ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం గ్రామాన్ని గురువారం జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్ ఆకస్మిరంగా సందర్శించారు. గ్రామ పరిధిలోని సెగిగేషన్ షెడ్డు వాడుకలో లేకపోవడం, తడి, పొడి చెత్త వేరు చేయకపోవడం, డంపింగ్ యార్డు ప్రాంగణంలోనే చెత్త పారబోయడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పల్లె ప్రకృతి వనంలో పిచ్చి మొక్కలతోపాటు అపరిశుభ్రంగా ఉండడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న పంచాయతీ కార్యదర్శికి ఎందుకు విధుల నుంచి తొలిగించకూడదో వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ సూచన మేరకు సక్రమంగా విధులు నిర్వహించాలని, నిర్లక్ష్యం చూపితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనవెంట ఎంపీడీఓ బన్సీలాల్, ఎంపీఓ జయంత్ రెడ్డి ఉన్నారు.

మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు పిడమర్తి రవి

కీసర రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మాదిగలకు 12శాతం రిజర్వేషన్ అమలు చేయాలని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు పిడమర్తి రవి డిమాండ్ చేశారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ అహ్మద్‌గూడలో గురువారం కీసర ఉమ్మడి మండల మాదిగల ఆత్మీయ సమ్మేళన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదిగలకు జనాభా ప్రాతిపదికన 12శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సిందేనన్నారు. ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపినప్పటికీ, అమరావతిలో నిర్వహించాల్సిన 'లక్ష డప్పులు వేయి గొంతుకలు' కార్యక్రమాన్ని హైదరాబాద్‌కు మార్చడం బాధాకరమన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనూ ఎస్సీ వర్గీకరణకు ఉద్యమం కొనసాగించాలన్నారు. ఫిబ్రవరి 2న ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించనున్న మాదిగ విద్యార్థి యువగర్జన కార్యక్రమానికి మాదిగలంతా పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మీసాల మల్లేష్, బక్కని నర్సింగ్‌రావు, అంబేద్కర్ సంఘం కీసర మండల అధ్యక్షుడు కొమ్ము సుదర్శన్, ప్రధాన కార్యదర్శి తుడుం శ్రీనివాస్, నాయకులు సమ్మయ్య, శ్రీనివాస్, గంగి మల్లేష్, చినింగని నర్సింహా, బాలయ్య, లింగం, స్వామి, బక్కని కుమార్, బోడ జంగయ్య, మంచాల రాజలింగం, గరుగుల మల్లేష్ పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు కృషి



డయాలసిస్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

శంషాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని సామాజిక ఆసుపత్రిలో గురువారం కొత్తగా ఏర్పాటు చేసిన డయాలసిస్ యూనిట్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మామహేందర్‌రెడ్డితో కలసి ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శంషాబాద్ మున్సిపాలిటీ, మండల ప్రజల సౌకర్యార్థం డయాలసిస్ యూనిట్‌ను ప్రారంభించినట్టు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గణేష్‌గుప్తా, నాయకులు దూడల వెంకటేష్‌గౌడ్, డాక్టర్ మైలారం దుర్గాలతతో పాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయూత అభినందనీయం



దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో ఆర్డీవో చంద్రకళ

చేవెళ్ల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు చేయూతనివ్వడం అభినందనీయమని ఆర్డీవో చంద్రకళ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ వసతి గృహంలోని 230 మంది విద్యార్థులకు మండల పరిధిలోని గొల్లపల్లికి చెందిన విఘ్నేష్‌గౌడ్ దుప్పట్లను ఆర్డీవో చంద్రకళ, తహసీల్దార్ కృష్ణయ్య సమక్షంలో విద్యార్థులకు అందించారు. ఆర్డీవో మాట్లాడుతూ విద్యార్థులకు చేయూతనిచ్చేందుకు ముందుకు రావడం చాలా గొప్ప విషయమన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతులుగా ఎదగాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

అధ్యాపకురాలికి డాక్టరేట్



ప్రశాంతి

ఘట్‌కేసర్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ, చౌదరిగూడ, నల్ల నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలోని సీఎస్‌సీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ అయిందాల ప్రశాంతికి డాక్టరేట్ లభించింది. చైతన్యభారతి ఇంజనీరింగు కళాశాల ప్రొ.డాక్టర్ రవీందర్‌రెడ్డి పర్యవేక్షణలో ప్రశాంతి 'ఎ మెషిన్ లెర్నింగ్ ఫ్రేమ్‌వర్క్ అండ్ అల్గోరిథమ్స్ ఫర్ అనోమెలే డిటెక్షన్ టువార్డ్స్ నెట్‌వర్కింగ్ సెక్యూరిటీ'పై పరిశోధన చేసినందుకు గానూ ఉస్మానియా యూనివర్సిటీలో డాక్టరేట్ అందజేసింది. కళాశాల డైరెక్టర్ సీవీ కృష్ణారెడ్డి, సీఎస్‌సీ హెచ్‌వోడీ రామేశ్వరయ్య, అధ్యాపకులు ప్రశాంతిని అభినందించారు.

రాష్ట్రీయ ఇండియన్ మిలటరీ కాలేజీకి విద్యార్థి ఎంపిక



ఫణీందర్‌రెడ్డి

కీసర రూరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ ఇండియన్ మిలటరీ కాలేజీ(ఆర్ఐఎంసీ)కి క్రాంతికిరణ్ పాఠశాల విద్యార్థి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కళ్యాణి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రానికి ఒకటి చొప్పున కేటాయించబడిన సీటును క్రాంతికిరణ్ పాఠశాలకు చెందిన విద్యార్థి సాధించడం సంతోషంగా ఉందని పాఠశాల యాజమాన్యం, విద్యార్థి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేసారు. నల్గొండకు చెందిన విద్యార్థి ఫణీందర్‌రెడ్డి పాఠశాలలోని ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ఈ ఈ ఘనతను సాధించినట్లు వివరించాడు. రాత పరీక్ష అనంతరం, వైవా చివరగా మెడికల్ టెస్ట్ నిర్వహించి సీటును కేటాయిస్తారని తెలిపారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ మంజులారమేష్

వికారాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని వికారాబాద్ మునిసిపల్ చైర్‌పర్సన్ మంజులా రమేష్ అన్నారు. ఆమెచూర్ కబడ్డీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం బ్లాక్ గ్రౌండ్‌లో బాలబాలికల సబ్ జూనియర్ లెవెల్ కబడ్డీ టోర్నమెంట్ సెలక్షన్స్‌ను పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డితో కలిసి టాస్ వేసి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నేనావత్ పరుశురాం నాయక్ మాట్లాడుతూ. టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన టీమ్‌కు రూ.10 వేల బహుమతి, రన్నర్‌గా నిలిచిన టీమ్‌కు రూ.5వేల బహుమతి అందజేయనున్నట్లు తెలిపారు. అబ్బాయిల నుంచి 12 మందిని, అమ్మాయిల నుంచి 12 మందిని ఎంపిక చేసి స్టేట్ స్థాయి కబడ్డీ పోటీలు వచ్చే నెల వికారాబాద్ జిల్లాలోనే నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ కిషన్ నాయక్, రమేష్ కుమార్, విశ్వనాథం సత్యనారాయణ, రత్నారెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ, పల్లె దవాఖానకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న నాయకులు

బొంరాస్‌పేట్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బురాన్‌పూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశానుసారం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. బురాన్‌పూర్‌లో గురువారం రూ.20లక్షలతో అంగన్‌వాడీ భవనం, రూ.20లక్షలతో పల్లె దవాఖానాకు ఏఈ సురేందర్‌రెడ్డితో కలిసి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భీమయ్యగౌడ్, అనంతయ్య, రాజేశ్వర్, వెంకటయ్య పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం



కులకచర్ల: వాలీబాల్ క్రీడాకారులతో కాంగ్రెస్ నాయకులు

కులకచర్ల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులను ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తుందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కుసుమ సముద్రం గ్రామంలో గురువారం మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు, సొసైటీ చైర్మన్ కనకం మొగులయ్యతో కలిసి భీమ్‌రెడ్డి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. కాంగ్రెస్ మండల కార్యదర్శి గోపాల్‌నాయక్, నాయకులు కుమ్మరి స్వామి, ఎల్లప్ప, జలీల్‌ఖాన్, రాములు, శ్రీనివాస్, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించే యువకులకు అండగా ఉంటాం

చౌడాపూర్: క్రీడల్లో రాణించే యువకులకు అండగా ఉంటామని బీజేపీ జిల్లా మోర్చా కార్యదర్శి శంకర్‌నాయక్ అన్నారు. లింగంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులకు క్రికెట్ కిట్‌ను అందజేశారు. టోర్నమెంట్‌లో వివిధ గ్రామాల నుంచి క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గోవింద్‌నాయక్, శంకర్‌నాయక్, కృష్ణయ్య, లక్ష్మి, నర్సింహ పాల్గొన్నారు.



జేసీబీతో తవ్వకాలు జరిపి శవాన్ని వెలికి తీసుస్తున్న పోలీసులు

శంషాబాద్‌లో దారుణం

- కోడలిని హత్య చేసిన కసాయి అత్త
- మరో వ్యక్తి సాయంతో సెల్లార్‌లో పూడ్చిపెట్టిన వైనం
- పోలీసులనే తప్పుదోవ పట్టించిన నర హంతకులు
- పూడ్చిపెట్టిన శవాన్ని వెలికి తీసిన పోలీసులు



మూడావత్ జోలీ (ఫైల్)

శంషాబాద్, శంషాబాద్‌రూరల్ (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం రామాంజాపూర్‌తండాలో దారుణం చోటు చేసుకుంది. సొంత కోడలిని మరోవ్యక్తి సహాయంతో హత్యచేసి మృతదేహాన్ని ఓ వెంచర్‌లోని సెల్లార్‌లో పూడ్చిపెట్టింది. పోలీసులు గురువారం వెలికితీయడంతో ఈ దారుణం వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. గత నవంబర్ 11న భర్త సురేశ్ తన భార్య జోలీ కనిపించడంలేదని శంషాబాద్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. శంషాబాద్ మండలం రామాంజాపూర్‌తండాలో నివాసముండే ముడావత్ సురేశ్, ముడావత్ జోలి(35) దంపతులు. వీరికి ఇద్దరు కొడుకులు. సురేశ్ తల్లిదండ్రులు తులసి, అనంతి శంషాబాద్.


పథకం ప్రకారమే హత్య

తన భర్త సురేశ్ రోజూ తప్పతాగి వచ్చి కొడుతున్నాడని జోలీ అత్తామామలకు చెప్పింది. కొడుకు సురేశ్ తన భార్య వేదిస్తుందని తల్లిదండ్రులకు చెప్పేవాడు. జోలీ తన కొడుకును వివాహం చేసుకోవడం ఇష్టంలేని తులసి కూడా కోడలితో గొడవపడేది. ఇద్దరి మధ్య సఖ్యత లేకపోడంతో అత్త తన భర్తతో కలసి సాతంరాయి వచ్చి కూలీ పనులు చేస్తూ వేరుగా ఉంటున్నారు. గతేడాది నవంబర్ 9న కోడలు తన భర్త మద్యం తాగి వచ్చి బాగా కొట్టాడని చెప్పింది. దీంతో అత్త సాతంరాయికి రమ్మని, ఇక్కడే కూలీ పని చూపిస్తానని నమ్మబలికింది. జోలీ సాతంరాయిలోని అత్త వద్దకు వచ్చింది. కోడలును చూడగానే అత్త కల్లు దుకాణానికి తీసుకెళ్లి తాగించింది. మత్తు ఎక్కాక మరో రెండు సీసాల కల్లుతెప్పించి అందులో గులికల మందు కలిపి తాగించింది. మత్తులోకి జారుకున్న కోడలిని మరో వ్యక్తి సహాయంతో దగ్గర్లోని త్రిలోక్ వెంచర్‌కు తీసుకెళ్లి సెల్లార్‌లో గోతితీసి పూడ్చి పెట్టింది. సురేశ్ తన భార్య కోసం రెండు రోజులు వెతికి నవంబర్ 11న శంషాబాద్‌రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసునమోదు చేసకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. విచారణలో అత్తపై అనుమానం వచ్చి తమదైన శైలిలో ప్రశ్నించంగా కోడలిని హత్య చేసి పాతిపెట్టిన విషయం తెలిపింది. దీంతో పోలీసులు త్రిలోక్ వెంచర్‌లో మృతదేహాన్ని జేసీబీతో తవ్వి బయటకు తీశారు. రాజేంద్రనగర్ మండల రెవెన్యూ అధికారి రాములుతో శవ పంచనామా చేయించి భర్తకు అప్పగించారు. ఈ హత్యకు ఎవరెవరు సహకరించారు అనే కోణంలో దర్యాప్తు జరుపుతున్నారు.

పంచాయతీ ఎన్నికల సందడి షురూ

- ఏర్పాట్లలో నిమగ్నమైన అధికార యంత్రాంగం
- ప్రారంభమైన విందులు, వినోదాలు
- ఫ్యూచర్ సిటీ పరిధిలో సందిగ్ధత!
- కార్పొరేషన్ ఏర్పాటు చేస్తారనే ఊహాగానాలు
- అథార్టీ లేదా కార్పొరేషన్ ఏర్పాటు : కేఎల్లార్





మహేశ్వరం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సంవత్సర కాలంగా పంచాయతీ ఎన్నికలు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న నాయకులకు.. త్వరలో ఎన్నికలు నిర్వహిస్తామని స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చేసిన ప్రకటనతో గ్రామాల్లోని వివిధ పార్టీల నాయకుల ఆశలకు జీవం పోసినట్లయింది. 2024 జనవరి 31న సర్పంచుల పదవీకాలం ముగియడంతో అప్పటి నుంచి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. దాంతో ప్రజలే కాకుండా పార్టీల నాయకులూ చాలా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ప్రభుత్వ ప్రకటనతో రాష్ట్ర ఎన్నికల సంఘం జీపీ ఎన్నికల నిర్వహణకు కసరత్తు ముమ్మరం చేసింది. ఇప్పటికే గ్రామాల్లో ఓటర్ల జాబితా, వార్డుల విభజన ప్రక్రియను అధికారులు సిద్ధం చేశారు. ఈమేరకు ఎన్నికలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను చేపట్టాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన అధికారులు, సిబ్బంది వివరాలను 'టీపోల్'లో అప్‌లోడ్ చేయాలని సూచించింది. ఇప్పటి వరకు గ్రామ పంచాయతీల వారిగా అమల్లో ఉన్న రిజర్వేషన్ల వివరాలను జిల్లా అధికారుల నుంచి సేకరించింది. ఓటర్ల జాబితాను గ్రామ పంచాయతీ వార్డుల వారిగా విభజించి అభ్యంతరాల స్వీకరణ అనంతరం తుది జాబితాను కూడా ప్రకటించింది. ఎన్నికల ప్రక్రియను నెల రోజుల్లో పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకోనుంది. మండలంలో మొత్తం 30 గ్రామ పంచాయతీలు, 260 వార్డులు ఉండగా.. వీటికి సంబంధించిన వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. ఇదిలా ఉండగా, ఆయా గ్రామాల్లో సర్పంచులుగా పోటీ చేయాలనే ఆశ ఉన్న వివిధ పార్టీల నాయకులు తమ పంచాయతీ, వార్డుల్లో రిజర్వేషన్‌పై ఆశగా ఎదురు చూస్తున్నారు. పోటీ చేయాలనుకున్న ఆశావహులు రిజర్వేషన్ల విషయంలో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల సమయం దగ్గర పడుతుండడంతో ఏ క్షణంలోనైనా ఎన్నికల షెడ్యూల్ వెలువడవచ్చనే చర్చలు జోరుగా సాగుతున్నాయి. అంతేకాకుండా ఇప్పటివరకు గ్రామాల్లో ఎక్కువ శాతం బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ఉండగా.. ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో కొందరు బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నారు. అంతేకాకుండా గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే వారు ఇప్పటి నుంచే యువతను మచ్చిక చేసుకోవడానికి విందులు ఏర్పాటు చేస్తున్నారు. అంతేకాకుండా ఏమవ్వా బాగున్నావా? ఏం తాత బాగున్నావా? అంటూ ఆప్యాయంగా పలకరిస్తున్నారు. మేజర్ గ్రామ పంచాయతీలైన మహేశ్వరం, నాగారం, మన్‌సాన్‌పల్లి, అమీర్‌పేట, పెండ్యాల, దుబ్బచర్ల, తుమ్మలూరు, మాణిక్యమ్మగూడ వంటి గ్రామాల్లో మాత్రం ఓటుకు రూ.5నుంచి 10 వేలు కూడా ఖర్చు చేయడానికి నాయకులు ఇప్పటి నుంచే సమకూర్చుకుంటున్నారు.

ఫ్యూచర్‌సిటీ పరిధిపై సందిగ్ధం

పంచాయతీ ఎన్నికలు జరుగుతాయని ఎంతో ఆశతో ఉన్న మహేశ్వరం, తుమ్మలూరు, మన్‌సాన్‌పల్లి, సిరిగిరిపురం, మొహబత్‌నగర్, ఆకన్‌పల్లి, గట్టుపల్లి, కేసీ తండా, గంగారం, ఉప్పుగడ్డతండా, ఎన్డీతండా నాయకులు అంతే నిరుత్సాహంగా కూడా ఉన్నారు. ఎందుకంటే ఈ గ్రామాలన్నింటినీ కలుపుకొని మహేశ్వరం కేంద్రంగా మున్సిపాలిటీ ఏర్పాటవుతుందనే వార్తలు ఆరు నెలలుగా వివిధ పార్టీల నాయకులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. అంతేకాకుండా మహేశ్వరం, కందుకూరు, యాచారం, ఇబ్రహీంపట్నం మండలాలను కలుపుకొని ఫ్యూచర్‌సిటీని ప్రత్యేక అథార్టీ లేదా కార్పొరేషన్ చేసే విషయమై ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ చేసిన ప్రకటన ఆయా మండలాల ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. అయితే, అధికారులు మాత్రం దీనిపై ఏమీ మాట్లాడటం లేదు.



చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు

ఆమనగల్లు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి నేపథ్యంలో పతంగులు ఎగర వేయడానికి చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ అధికారులు జగన్‌మోహన్, అన్వర్ హుస్సేన్‌లు అన్నారు. పట్టణంలో గురువారం గాలి పటాలు విక్రయిస్తున్న దుకాణాలలో అటవీ శాఖ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.

ప్రగతి నిరోధకంగా విపక్షాలు

ఆమనగల్లు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విపక్షాలు ప్రతిదీ రాజకీయం చేస్తూ ప్రగతి నిరోధకంగా మారాయని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు మండ్లీ రాములు, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో చేటు చేసుకున్న అవినీతి అక్రమాలను కప్పిపుచ్చుకోవడానికి బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై విష ప్రచారాలకు ఒడిగట్టారని వారు మండిపడ్డారు. ఆమనగల్లు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద గురువారం కాంగ్రెస్ నాయకులు విలేకరులతో మాట్లాడుతూ ప్రగతిని అడ్డుకునే వారు ఎంతటి వారైన ప్రభుత్వం ఉపేక్షించబోదన్నారు. రాష్ట్రంలో ప్రగతిని జీర్ణించుకోలేక బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్, సీఎం రేవంత్ రెడ్డిని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు.

బీఆర్ఎస్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి

మహేశ్వరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తొమ్మిదిన్నరేళ్లలో బీఆర్ఎస్ గ్రామాల్లో చేసిన అభివృద్ధి తప్పా.. కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సర కాలంగా చేసిందేమీ లేదని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని పడమటి తండాలో నూతన గ్రామపంచాయితీ భవనాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రజలకు 420 హామీలు ఇచ్చి.. ఏ ఒక్కటీ అమలు చేయకుండా ఘోరంగా విఫలమైందన్నారు. ప్రభుత్వ పనితీరును ప్రశ్నిస్తున్న వారిపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేయడమే సీఎం చేసిన అభివృద్ధి అంటూ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ నేతృత్వంలో గ్రామాలు పచ్చదనం, పరిశుభ్రతతో కళకళలాడేవన్నారు. తండాలను జీపీలుగా తీర్చిదిద్దిన ఘనత కూడా బీఆర్ఎస్‌కే దక్కిందన్నారు. రేవంత్‌రెడ్డి అసమర్థత పాలనను నిలదీస్తున్న కేటీఆర్‌పై.. ఫార్ములా-ఈ కార్ రేస్ విషయంలో అక్రమ కేసుతో జైలుకు పంపాలని చూస్తున్నారన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారనే విషయాన్ని కాంగ్రెస్ నాయకులు మరిచిపోతున్నారన్నారు. కార్యక్రమంలో రాజునాయక్, పాండుయాదవ్, దేవ్లానాయక్, జంగయ్య, అంజనేయులు,యాదయ్య, కె.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



పడమటి తండాలో జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల వాగ్వాదం

పడమటి తండాలో జీపీ భవనాన్ని ప్రారంభించే కార్యక్రమంలో ఎమ్మెల్యే సబితారెడ్డి ఏకపక్షంగా.. జిల్లా మంత్రికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు ఆందోళనకు దిగారు. దాంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ జై తెలంగాణ, జై సబితమ్మఅంటూ ఎదురు దాడికి దిగారు. పరిస్థితి చేజారకుండా మహేశ్వరం డీసీపీ సునితారెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు రంగంలోకి దిగి ఇరు పార్టీల నాయకులను సముదాయించి గొడవలకు తావు లేకుండా చేశారు.

సబితారెడ్డిది అధికార దాహం : భాస్కర్‌రెడ్డి

కాగా, సబితారెడ్డికి ఎప్పుడూ అధికార దాహం తప్పా.. ఓ సిద్ధాంతం, ప్రొటోకాల్ తెలియదని పీసీసీ సభ్యుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం మహేశ్వరం మండలం పడమటి తండాలో నూతన జీపీ భవనాన్ని ప్రారంభించే కార్యక్రమంలో అత్యుత్సాహం ప్రదర్శించడంతో పాటు అధికార యంత్రాంగానికి, జిల్లా ఇన్‌చార్జి మంత్రికి ఏమాత్రం సమాచారం ఇవ్వకుండా తన అనుచరులతో వచ్చి ప్రారంభించడంపై పడమటి తండాలో కాంగ్రెస్ నాయకులు నిరసన చేపట్టారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు ఈ కార్యక్రమానికి వస్తారని తెలిసి.. అధికారులకు సమాచారం లేకుండా కార్యక్రమాలు ఎలా ప్రా రంభిస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు కాకి ఈశ్వర్, యాదయ్య నర్సింహ, రాజునాయక్, లాజర్, శివ, చంద్రమౌళి, భాస్కర్ పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



కడ్తాలలో భట్టిని సన్మానిస్తున్న శ్రీనివాస్‌గౌడ్, నర్సింహ, శ్రీనివాస్‌రెడ్డి



ఆమనగల్లులో మల్లును సత్కరిస్తున్న మండ్లీ రాములు, కేశవులు, శ్రీనివాస్ రెడ్డి, మానయ్య

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

ఆమనగల్లు/కడ్తాల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి, పేదల శ్రేయస్సును కాంక్షించి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను పార్టీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకుపోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కోరారు. ఆమనగల్లు, కడ్తాల మండల కేంద్రాలలో గురువారం మల్లు భట్టి విక్రమార్కకు ఘన స్వాగతం లభించింది. వనపర్తి జిల్లా కేంద్రంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడానికి ఎంపీ డాక్టర్ మల్లు రవితో కలిసి వెళ్తున్న భట్టి విక్రమార్కకు ఆయా చోట్ల రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు బాలాజీసింగ్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు మండ్లీ రాములు, కాంగ్రెస్ నేతలు బ్యాండ్ వాయిద్యాలతో ఎదురేగి ఘన స్వాగతం పలికారు. కడ్తాల మండలం మక్తమాదారంలో విద్యుత్ ఉప కేంద్రం ఏర్పాటు చేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మైసిగండిలో, పలు చోట్ల నివాస గృహాల మీదుగా ఉన్న ప్రమాదకర విద్యుత్ లైన్లను తొలగించాలని, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలని, కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని నాయకులు వినతిపత్రాలు అందజేశారు. ఆమనగల్లు ఏఎంసీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్, కాంగ్రెస్ మండలాధ్యక్షులు బీచ్యనాయక్, ప్రభాకర్‌రెడ్డి, జగన్, మానయ్య, కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కాలె మల్లయ్య, అజీం, వస్పుల శ్రీశైలం, గాజుల శ్రీను, ఖాదర్‌ఖాద్రీ, విజయ్, మల్లేశ్ నాయక్, అలీం, ఫరీద్, వస్పుల శ్రీకాంత్, నాజర్, ఖాదర్, రాఘవేందర్, బాల్‌రాజ్, మహేశ్, సురేశ్ నాయక్, కండె సాయి, బాబా, మల్లేశ్ గౌడ్, అశోక్, శంకర్, నరేందర్, లక్‌పతినాయక్, చేగూరి వెంకటేశ్, లక్ష్మయ్య, రాజేందర్, రాజేశ్, ఇమ్రాన్‌బాబా, షాబోద్దీన్, బోసు రవి, జగన్, జంగారెడ్డి, సత్యం యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల ధరలకు రెక్కలు

(3వ పేజీ తరువాయి)

ధరలు యాసంగిలో భారీగా పెరగడంతో రైతులపై మరింత ఆర్థిక భారం పడనుంది.

గిట్టుబాటు కావడం లేదంటున్న వ్యాపారులు

భవిష్యత్తులో ఎరువుల కొరత తీవ్రంగా ఉండే అవకాశం ఉండడంతో దీన్ని నివారించేందుకు వ్యవసాయ శాఖ చర్యలు మొదలు పెట్టింది. ఎరువులను ఆధార్ కార్డు ఉన్న రైతుకు మాత్రమే విక్రయించేలా వ్యవసాయ అధికారులు వ్యాపారులపై వత్తిడి పెంచారు. ఎరువులు కొనుగోలు చేస్తున్న రైతు వేలి ముద్ర తీసుకోవడం లేదా ఆధారిత ఫోన్‌కు వచ్చే ఓటీపీ ద్వారా విక్రయాలు చేయాలని సూచిస్తున్నారు. బస్తాపై రూ.265 రూపాయల ఎమ్మార్పీ ఉండగా ఇది తమకు గిట్టుబాటు కావడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. ఎరువుల కంపెనీ నుంచి సరుకు వచ్చే వరకు బస్తాకు రూ. 285 నుంచి రూ. 290 వరకు ఖర్చవుతుందని అందుకే యూరియా రూ. 300లకు విక్రయిస్తున్నామని కొందరు చెబుతున్నారు.

అందని రైతు భరోసా

మళ్లీ ఎరువుల ధరలు పెరగడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రభుత్వం పెట్టుబడి సాయం(రైతుబంధు) కింద అందిస్తున్న సాయం కూడా ఇంత వరకు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే పెట్టుబడి సాయం కూడా పెరిగిన ఖర్చులతో ఆవిరవుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల ధరలతో పాటు కూలీల ధరలు పెరగడంతో రైతులకు వ్యవసాయ పెట్టుబడి మరింత భారంగా మారిన సంగతి విదితమే. దీంతో ప్రభుత్వం ఇచ్చే పెట్టుబడిసాయం కూడా రైతులకు సరిపోవడం లేదు. వాస్తవానికి రైతులకు గతంలో కేంద్రం రైతులకు సరఫరా చేసే ఎరువులకు భారీగా సబ్సిడీ ఇచ్చేది. కానీ ఇటీవల కాలంలో సబ్సిడీని తగ్గించేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కేంద్రం మళ్లీ ఎరువులపై సబ్సిడీ పెంచాలని డిమాండ్ వ్యక్తమవుతోంది.

ట్రాఫిక్ రూల్స్ తప్పక పాటించాలి



శంకర్‌పల్లి : డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ వెంకటేశం

చేవెళ్ల/శంకర్‌పల్లి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): వాహనాలు డ్రైవ్ చేసేవారు ట్రాఫిక్ రూల్స్‌ను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని, రూల్స్ తప్పక పాటించాలని చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం తెలిపారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై చేవెళ్ల మండలంలోని ఆయా కంపెనీల వద్ద గురువారం డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే చాలా వరకు ప్రమాదాలను తగ్గించిన వారు అవుతారని చెప్పారు. రోడ్డు దాటే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ట్రిపుల్ రైడింగ్, లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయడం, సిగ్నల్ పాటించకపోవడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఏఎస్సైలు చందర్ నాయక్, అశోక్, సిబ్బంది తదితరులున్నారు. అలాగే డ్రైవర్లు పరిమితమైన వేగంతో బస్సులు నడపాలని, ట్రాఫిక్ రూల్స్ తప్పక పాటించాలని సీఐ వెంకటేశం తెలిపారు. దొంతాన్‌పల్లిలోని ఇక్ఫాయ్ బస్సు డ్రైవర్లకు ఆయన అవగాహన సమావేశం నిర్వహించారు. మద్యం సేవించి ర్యాష్‌డ్రైవింగ్ చేయరాదని, డ్రైవర్లు అస్వస్థతకు గురైతే బస్సులు వెంటనే రోడ్డు పక్కన ఆపాలని సూచించారు. అన్ని పత్రాలను కలిగి ఉండాలని, సురక్షితమైన డ్రైవింగ్ ముఖ్యమని తెలిపారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ డాక్టర్ ఎల్.ఎస్ గణేష్, రిజిస్ట్రార్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బందోబస్తు మధ్య హద్దుల గుర్తింపు

(3వ పేజీ తరువాయి)

వాదనకు దిగుతుండగా ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు, యాచారం సీఐ నర్సింహారావు, యాచారం తహసీల్దార్ అయ్యప్ప, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు మురళి, రామకృష్ణ వారిని సముదాయించారు. ఎవరి భూములు, ఎన్ని ఎకరాలు సేకరణ ఉంటుందో సర్వేలో తేలుతుందని వివరించారు. బాధితులకు పరిహారం అందించి ఆదుకుంటామని తెలిపారు. కొందరు రైతులు తమ భూముల్లో సర్వే చేయాలని ముందుకు రావడంతో రెవెన్యూ, పోలీస్ అధికారు అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

సర్వే ఆపండి: ఆర్డీవోకు వినతి

భూముల సర్వే చేయరాదని కోర్టు స్టే ఉందని, సర్వే చేయొద్దని ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, వినోద్‌కుమార్‌రెడ్డి తదితరులు కుర్మిద్దతండాలో రోడ్డు సర్వే పనులను పరిశీలిస్తున్న ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డికి వినతిపత్రం అందించారు. ఇప్పటికే కొందరి భూమి ఫార్మాసిటీలో పోయిందని, మళ్లీ రోడ్డు కోసం భూములు తీసుకుంటే బతుకేదెట్లా అని ఆందోళన వ్యక్తం చేశారు. నిబంధనల మేరకు సర్వే చేస్తున్నామని, రోడ్డు వేస్తే భవిష్యత్‌లో భూములకు విలువ పెరుగుతుందని, ఏ ఒక్కరికీ అన్యాయం జరగనివ్వమని ఈ సందర్భంగా అధికారులు రైతులను సముదాయించారు.

కుర్మిద్దలో పోలీసుల మోహరింపు

కుర్మిద్దతండా నుంచి రోడ్డు కోసం అధికారుల సర్వే సందర్భంగా రైతులు అడ్డుకుంటారని పోలీస్, రెవెన్యూ అధికారులు భావించారు. ఉదయం 8 గంటలకే రాచకొండ కమిషనరేట్‌కు చెందిన అదనపు డీసీపీలు సత్యనారాయణ, శ్రీధర్, ఇద్దరు ఏసీపీ కేపీవీ రాజుతోపాటు సీఐలు కృష్ణంరాజు, నర్సింహారావు, ఎస్సైలు తేజంరెడ్డి, నాగరాజు, మరో నలుగురు ఎస్సైలు, 50 మంది స్పెషల్ పార్టీ పోలీసులు తండాలో మోహరించారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఆందోళనకారులతో సీఐ కృష్ణంరాజు పలుమార్లు చర్చించడంతో సర్వే సాఫీగా సాగింది.

మొయినాబాద్‌ను మున్సిపాలిటీ చేయొద్దు



మంత్రి శ్రీధర్‌బాబుతో మండల నాయకులు

మొయినాబాద్ రూరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మొయినాబాద్ మండలం గ్రామీణ ప్రాంతమని, మున్సిపాలిటీగా చేయొద్దని మండల నాయకులు కోరారు. ఈమేరకు మంత్రి శ్రీధర్‌బాబును గురువారం నగరంలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. జీవో 111తో ఇప్పటికే అనేక ఇబ్బందులు పడుతున్నామని, మళ్లీ మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోదని వినతిపత్రంలో పేర్కొన్నారు. తమ అభ్యర్థనను గుర్తించి మండలాన్నే కొనసాగించాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ పాటి జగన్‌మోహన్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు గురుగు రాజు, తదితరులు ఉన్నారు. ఇదే విషయంపై ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డిని సైతం కలిసి వినతిపత్రం అందజేశారు.

'బంజారా మౌఖిక సాహిత్యం-పరిశీలన'లో

మోడల్ స్కూల్ టీచర్‌కు డాక్టరేట్



జ్యోతిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ విష్ణుప్రియ, ఉపాధ్యాయ బృందం

కందుకూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేదునూరు మోడల్ స్కూల్‌లో పీజీటీ(తెలుగు)గా పనిచేస్తున్న జ్యోతి డాక్టరేట్ అందుకున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బంజారా మౌఖిక సాహిత్యం-పరిశీలన అనే అంశంపై పరిశోధనలు చేసి ఉస్మానియా యూనివర్సిటీ ఓరియంటల్ విభాగంలో అందజేశారు. దాంతో తెలంగాణ సారస్వత పరిషత్ ఓరియంటల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ అజ్మీరా స్కిలానాయక్ పర్యవేక్షణలో జ్యోతి డాక్టరేట్ అందుకున్నారు. గురువారం జ్యోతిని ప్రిన్సిపాల్ విష్ణుప్రియ ఆధ్వర్యంలో సన్మానించారు. వైస్‌ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌చారి, టీచర్లు తదితరులున్నారు.

ఎస్సీ వర్గీకరణ చేసేదాకా పోరాడతాం

యాచారం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): దళిత వర్గీకరణ చేసేదాకా తమ పోరాటం ఆపే ప్రసక్తే లేదని, ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నగరవాసులు ఉలిక్కిపడేలా లక్ష డప్పులతో దండోరా మోగిస్తామని, ఉద్యమాన్ని నీరుగార్చడానికి పాలకులు ఎన్నికుట్రలు పన్నినా పోరాటం ఆపబోమని ఎమ్మార్పీఎస్ యాచారం మండల జేఏసీ కన్వీనర్ బోడ కృష్ణ తేల్చిచెప్పారు. గురువారం మండలంలోని గున్‌గల్‌లో ఎమ్మార్పీఎస్ సమావేశంలో బోడ కృష్ణను మండల కన్వీనర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు బోడ ముత్యాలు, బోడ అబ్బయ్య, స్టాలిన్, శంకర్, మల్లేష్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగలంతా సంఘటితం కావాలి

ఇబ్రహీంపట్నం : ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ సాధనకై మాదిగలంతా సంఘటితం కావాల్సిన ఉందని మాదిగ జేఏసీ జిల్లా గౌరవాధ్యక్షుడు బోసుపల్లి ప్రతాప్ అన్నారు. లక్ష డప్పులు, వేయి గొంతులతో వచ్చే నెల 7న నగరంలో జరిగే బహిరంగ సభకు పెద్దఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. బుధవారం రాత్రి ఉప్పరిగూడలో ఎమ్మార్పీఎస్ సమావేశంలో మాట్లాడారు. గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా నరాల చంద్రపాల్, వైస్ చైర్మన్లుగా బోసుపల్లి మోహన్, నర్కుడి మహేందర్‌తోపాటు పలువురు కమిటీ సభ్యులుగా ఎన్నికైనారు. నియోజకవర్గ అధ్యక్షుడు భాస్కర్ తదితరులున్నారు.

ఆర్యవైశ్య సంఘం షాద్‌నగర్ అధ్యక్షుడిగా శ్రీనివాస్

షాద్‌నగర్ అర్బన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా మలిపెద్ది శ్రీనివాస్‌గుప్త ఏకగ్రీవంగా ఎన్నికైనారు. ప్రస్తుత అధ్యక్షుడు కల్వ యాదగిరీష్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేసి, శ్రీనివాస్‌గుప్తను ఎన్నుకున్నారు. ఈనెల 15 నుంచి రెండేళ్లపాటు అధ్యక్షుడిగా కొనసాగనున్నారు. ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవి క్లబ్‌లలో పలు పదవులను సమర్థవంతంగా నిర్వహించిన శ్రీనివాస్‌గుప్త కాశీ అన్నపూర్ణ నిత్యన్నసత్రం సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన శ్రీనివాస్‌గుప్తను ఆర్యవైశ్య సంఘాల నాయకులు అభినందించారు.



నియామకపత్రం అందుకుంటున్న శ్రీనివాస్ గుప్తా

ప్రియాంక గాంధీపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

కేశంపేట, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఎంపీ ప్రియాంక గాంధీపై బీజేపీ ఎంపీ రమేష్ బిందూరి చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికాదని యూత్ కాంగ్రెస్ కేశంపేట మండలాధ్యక్షుడు రమేష్ అన్నారు. బీజేపీ ఎంపీ వ్యాఖ్యలకు నిరసిస్తూ గురువారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి, నిరసన వ్యక్తం చేశారు. పోలీస్ స్టేషన్‌లో సీఐ నరహరికి ఈ సందర్భంగా ఫిర్యాదు చేశారు.

మొక్కల పెంపకంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

చౌదరిగూడ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): నర్సరీలో మొక్కల పెంపకం పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లేడుచౌదరిగూడ ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు. గురువారం మండల పరిధిలోని తూంపల్లి, ఇంద్రానగర్ గ్రామ పంచాయతీలో నర్సరీలను పరిశీలించారు. మొక్కల పెంపకం కోసం తీసుకుంటున్న జాగ్రత్తలను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలానికి మొక్కలు నాటుకునేందుకు సిద్ధంగా ఉండాలని ఈ సందర్భంగా సూచించారు.

కష్టాల కడలిలో కార్మికులు!

(3వ పేజీ తరువాయి)

గ్రామాల్లో పరిశ్రమలు విస్తరించాయి. షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఫరూఖ్‌నగర్, ఎలికట్ట, కొందుర్గు మండలాల్లో కూడా విరివిగా పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. దాదాపు 300కు పైగా భారీ, మధ్య, చిన్న తరహా పరిశ్రమలు వెలిశాయి.

35 వేల మంది కార్మికులు

కొత్తూర్ పారిశ్రామికవాడ ఏర్పాటుతో ఆయా గ్రామాల్లో వెలిసిన పరిశ్రమల్లో దాదాపు 15 వేల మంది కార్మికులు వివిధ పరిశ్రమల్లో పని చేస్తుండగా, ఫరూఖ్‌నగర్, కొందుర్గు మండలాల్లో మరో 20వేల మంది కార్మికులు ప్రత్యక్షంగా, పరోక్షంగా పనిచేస్తున్నారు. రాష్ట్రంలోని ఆయా ప్రాంతాలకు చెందిన కార్మికులతోపాటు ఆంధ్రప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, ఉత్తరాంచల్, ఒడిశా, రాజస్థాన్, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల నుంచి కార్మికులు కొత్తూర్ పారిశ్రామిక వాడకు వలస వచ్చి ఆయా పరిశ్రమల్లో ఉపాధి పొందుతున్నారు. ఇందులో 30శాతం మంది కార్మికులు మాత్రమే పర్మనెంట్ కార్మికులుగా పనిచేస్తుండగా, 70శాతం మంది కాంట్రాక్టు, క్యాజువల్ కార్మికులుగా పనిచేస్తున్నారు.

పారిశ్రామికవాడ ఏర్పడి నాలుగు దశాబ్దాలు పూర్తయినా కార్మికులు నేటికీ కనీస సౌకర్యాలకు నోచుకోవడం లేదు. పక్కా ఇళ్లతోపాటు విశ్రాంతి గదులు, అంబులెన్స్, ట్రాన్స్‌పోర్టు, మరుగుదొడ్ల సౌకర్యానికి నోచుకోవడం లేదు. గర్భిణులైన మహిళా కార్మికులకు ప్రత్యేక వసతులు కల్పించాల్సి ఉన్నా ఎక్కడా కానరావడం లేదు. కొన్ని పరిశ్రమల యాజమాన్యాలు రేకుల షెడ్లు, శిథిలావస్థకు చేరిన గదులను కార్మికులు నివాసం ఉండేందుకు కేటాయిస్తూ చేతులు దులుపుకుంటున్నారు. ముఖ్యంగా మహిళ కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయాల్లో విధులు ముగించుకొని ఇంటికి వెళ్లేందుకు ఎటువంటి ట్రాన్స్‌పోర్టు సౌకర్యం కల్పించకపోవడంతో వారంతా బిక్కుబిక్కుమంటూ ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుంది.

ఉద్యమాలు ఉధృతం చేస్తాం



కార్మిక చట్టాలను పారిశ్రామికవేత్తలు పాటించడంలో పూర్తిగా విఫలమవుతున్నారు. పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు మౌలిక వసతులు, విశ్రాంతి, భోజన గదులు, తాగు నీరు, అంబులెన్స్ ట్రాన్స్‌పోర్టు వసతులను పరిశ్రమల యాజమాన్యాలు విధిగా కల్పించాలి. వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించకపోతే ఉద్యమాలు ఉధృతం చేస్తాం.

- పానుగంటి పర్వతాలు, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి

ఆశాల సమస్యలు పరిష్కరించాలి

శంషాబాద్ రూరల్/తలకొండపల్లి/కందుకూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని, ఆశా రాష్ట్ర కమిటీ నిర్ణయాలను అన్ని జిల్లా కమిటీలు అమలు చేయాలని రాష్ట్ర అధ్యక్షురాలు పి.విజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శి ఆర్.నీలాదేవి డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం శంషాబాద్ మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలికి వినతిపత్రం అందించారు. నేడు(శుక్రవారం) ఎమ్మెల్యేల ఇళ్ల ఎదుట ధర్నాలు నిర్వహించి వినతి పత్రాలు అందించనున్నట్లు తెలిపారు. అన్ని జిల్లా కమిటీలు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. అలాగే ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం నేడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, ఇంటి వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు సీఐటీయు ఏరియా కన్వీనర్ పెంటయ్య తెలిపారు. తలకొండపల్లి పీహెచ్‌సీ అధికారులకు గురువారం ఆశా కార్యకర్తలు, సీఐటీయు నాయకులు సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రం అందజేశారు. ఆశా వర్కర్ల మండల ప్రధాన కార్యదర్శి శిరీష, యాదబాయి, కోమటి, తదితరులున్నారు. కాగా, ఆశావర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయు కందుకూరు మండల కన్వీనర్ బాల్‌రాజ్ అన్నారు. ఆశావర్కర్ల సంఘం మండల శాఖ సభ్యులతో కలిసి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారికి వినతి పత్రం ఇచ్చారు. సీఐటీయు మహేశ్వరం మండల కన్వీనర్ శేఖర్, ఆశావర్కర్లు ముంతాజ్, శ్రీలత, జయసుధ, ప్రేమలత, తదితరులున్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

చేవెళ్ల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ నిరంతరం పని చేస్తుందని ఆ యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామల మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కొనగారి కృష్ణారెడ్డి తెలిపారు. గురువారం చేవెళ్ల మండల కేంద్రంలో పీఆర్టీయూ-2025 సంవత్సరం క్యాలెండర్‌ను ఉపాధ్యాయ సంఘం నాయకులు, పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఎంఈవో పురందాస్, చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు శైలజాఆగిరెడ్డి, రమేశ్‌గౌడ్, మండల యూత్ అధ్యక్షుడు మద్దెల శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్, నాయకులు, ఉపాధ్యాయుడు పడాల దయనంద్ తదితరులు ఉన్నారు.

చేవెళ్ల పట్టణ కేంద్రంలో ఎస్టీయూ చేవెళ్ల మండల శాఖ క్యాలెండర్‌ను చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, చేవెళ్ల మాజీ సర్పంచ్ శైలజా ఆగిరెడ్డి ప్రారంభించారు. గురువారం మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయం ఆవరణలో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఎంపీడీవో కార్యాలయం సూపరింటెంటెండ్ రవీందర్, ఎంపీవో పురందాస్, ఎస్టీయూ మండలాధ్యక్షుడు హరి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీధర్, కృష్ణ, తదితరులున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సీనియర్ నాయకుడు శ్రీశైలం

మొయినాబాద్ రూరల్, జనవరి త9(ఆంధ్రజ్యోతి): ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేసి నిజాలను నిర్భయంగా రాసేది ఆంధ్రజ్యోతి దినపత్రికనేనని కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకుడు బండ్లగూడ సంధ్య శ్రీశైలం అన్నారు. గురువారం మండలంలోని అజీజ్‌నగర్‌లో స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి 2025 ఆంధ్రజ్యోతి క్యాలెండర్ ఆవిష్కరించారు. నాయకులు, కార్యకర్తలున్నారు.

ఆత్మవిశ్వాసం విజయానికి సోపానం



టోర్నీని ప్రారంభిస్తున్న సీఐ, ఎంపీడీవో

కడ్తాల్, జనవరి 9(ఆంధ్ర జ్యోతి): పట్టుదల, ఆత్మవిశ్వాసం విజయానికి సోపానమని కడ్తాల సీఐ శివప్రసాద్, ఎంపీడీవో సుజాతలు అన్నారు. యువత, విద్యార్థులు క్రీడల్లో రాణించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలని కోరారు. కడ్తాల బట్టర్‌పై స్కూల్ క్రీడా మైదానంలో గురువారం కడ్తాల మండల అధికారులు, యూత్ టీమ్‌కు ప్రత్యేక క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి, టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి లతో కలిసి టోర్నమెంట్‌ను సీఐ శివప్రసాద్, ఎంపీడీవో సుజాతలు ప్రారంభించారు. కడ్తాల యూత్ టీం విజయం సాధించింది. శ్రీనివాస్‌గౌడ్, భాస్కర్‌రెడ్డిలు ప్లేయర్ ఆఫ్‌ది అవార్డు టీమ్ ప్లేయర్‌కు అందజేశారు. ఎస్సై వరప్రసాద్, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, హన్మనాయక్, తదితరులు పాల్గొన్నారు.

పనుల మంజూరు బీఆర్‌ఎస్‌ది.. ప్రారంభోత్సవాలు కాంగ్రెస్‌వి

చేవెళ్ల, జనవరి 9(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి పనులకు కాంగ్రెస్ నాయకులు శిలాఫలకాలు వేసి ప్రారంభోత్సవాలు చేయడం సిగ్గుచేటు అని బీఆర్‌ఎస్ చేవెళ్ల మండలాధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్ అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈసీ, మూసీ వాగులపై బ్రిడ్జిల నిర్మాణం కోసం బీ ఆర్‌ఎస్ హయాంలోనే పనులు మంజూరు చే యడం జరిగిందన్నారు. చేవెళ్ల మండల పరిధిలోని ముడిమ్యాల్ గేటు నుంచి రావులపల్లి, మేడిపల్లి గ్రామాల వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే జీవోను జారీచేస్తే కాంగ్రెస్ నాయకులు పాత జీవోతోనే పనులకు శ్రీకారం చుట్టామని శిలాఫలకాలు ఏర్పాటుచేసి కొబ్బరికాయలు కొట్టడం విడ్డూరంగా ఉందన్నారు. షాబాద్ మండలంలో అనేక పరిశ్రమలు, శంకర్‌పల్లి మండలంలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చర్యలు తీసుకున్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. కేసీఆర్‌పై స్పీకర్ ప్రసాద్‌కుమార్ అనుచిత వ్యాఖ్యలు సబబు కాదన్నారు. స్పీకర్ వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని అన్నారు. బీఆర్‌ఎస్ యూత్ చేవెళ్ల నియోజకవర్గం అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, నారాయణ, ప్రభాకర్‌రెడ్డి, విగ్నేష్‌గౌడ్, నరహరిరెడ్డి, తోట చంద్రశేఖర్, ఎల్లయ్య, నర్సింలు, కృష్ణ, మాణిక్యరెడ్డి, తదితరులున్నారు.

వైకుంఠ ఏకాదశికి అనంత పద్మనాభస్వామి ఆలయం ముస్తాబు



కొత్తూర్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని మండల పరిధిలోని పెంజర్ల శివారులో అనంతపద్మనాభస్వామి ఆలయం ముస్తాబైంది. ఆలయ కమిటీ చైర్‌పర్సన్ అనితారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం తెల్లవారు జామునుంచే ప్రత్యేక పూజలతో ఏకాదశి పూజలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. ప్రముఖ వీణ వాయిద్యకారిణి దుర్గా మైత్రేయి బృందంతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తులకు ఉత్తర ద్వారం దర్శనం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలంకరణతో సర్వంగా సుందరంగా తీర్చిదిద్దారు.

అఖిల భారత యాదవ మహాసభ మండలాధ్యక్షుడిగా సురేష్ యాదవ్



నియామక పత్రం ఇస్తున్న నాయకులు

మొయినాబాద్ రూరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): యాదవులందరూ ఐక్యంగా ఉండి తమ హక్కులు సాధించుకునేందుకు కృషి చేయాల్సిన అవసరముందని అఖిల భారత యాదవ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్. లక్ష్మణ్ యాదవ్ తెలిపారు. మండలంలోని హిమాయత్ నగర్‌లోని ఓ గార్డెన్‌లో సంఘం జిల్లా కార్యవర్గ నూతన క్యాలెండర్‌ను విడుదల కార్యక్రమం నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మొయినాబాద్ మండలానికి చెందిన సురేష్ యాదవ్‌ను మండలాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఆమనగల్లు : ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణం పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఎమ్మెల్యే నారాయణరెడ్డి పర్యవేక్షణలో పనులు కొనసాగుతున్నాయి. గురువారం మొదటి అంతస్తు స్లాబ్ నిర్మాణం చేపట్టారు. డీఈ రవీందర్ పనులు ప్రారంభించారు.

తలకొండపల్లి : మండల సాధన కోసం గట్టుఇప్పలపల్లి గ్రామస్తులు పోరాటం ఉధృతం చేశారు. నెలల కాలంగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం నిరసిస్తూ గురువారం సాయంత్రం వంటా-వార్పు నిర్వహించి నిరసన తెలిలి, ర్యాలీ నిర్వహించారు.

మహేశ్వరం : ఉపాధ్యాయుల సమస్యలపై టీఎస్‌యూటీఎఫ్ నిరంతరం పోరాటాలు చేస్తుందని మండల విద్యాధికారి కస్నానాయక్ అన్నారు. మండల కేంద్రంలో టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు.

కడ్తాల్ : మండల కేంద్రంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న గూడూరు నారాయణరెడ్డి స్మారక కేపీఎల్ సీజన్-3 క్రికెట్ టోర్నమెంట్‌ను డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. ఆమనగల్లు మార్కెట్ వైస్‌చైర్మన్ భాస్కర్ రెడ్డితో కలిసి మాట్లాడుతూ నేడు(శుక్రవారం) ఫైనల్ మ్యాచ్ ఉంటుందన్నారు.

కడ్తాల్ : చరికొండలో దివ్యాంగులకు ఉచిత బస్సుపాస్‌ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ పాలకుర్ల రాములు చరికొండకు చెందిన 40మంది దివ్యాంగులకు సొంత డబ్బుతో ఉచిత బస్సు పాస్‌లను సమకూర్చారు. నాయకులతో కలిసి దివ్యాంగులు వాటిని పంపిణీ చేశారు.

తలకొండపల్లి : రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ తలకొండపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో క్యాలండర్ ఆవిష్కరించారు. తలకొండపల్లిలో నిర్వహించిన కార్యక్రమానికి ఎంఈవో చంప్లానాయక్ హాజరై ఉపాధ్యాయసంఘ నాయకుడు, జిల్లా కార్యదర్శి రాములయ్యతో కలిసి ఆవిష్కరించారు.

కేశంపేట : ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాల(బైలా) ఆధారంగా మహిళా సంఘాలు పనిచేయాల్సి ఉంటుందని ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి చెప్పారు. మహిళా సమాఖ్య భవనంలో గ్రామ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, వీవోఏలకు నూతన మార్గదర్శకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

కేశంపేట : ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థికి అపార్ ఐడీ ఉండాలని కేశంపేట ఇన్‌చార్జీ ఎంఈవో చంద్రశేఖర్ సూచించారు. మండల మానవ వనరుల భవనంలో గురువారం ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

క్రైం కార్నర్

విషాదం మిగిల్చిన విహారయాత్ర

వేవ్‌పూల్‌లో విద్యార్థి మృతి

శంకర్‌పల్లి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): వేవ్‌పూల్‌లో ఆడుతుండగా ప్రమాదవశాత్తు ఓ బాలుడు మృతిచెందాడు. నగరంలోని శాలిబండకు చెందిన రఫియా, గులాం రసూల్ అన్సారీల కుమారుడు ఫైజన్ అన్సారీ(11) జాన్నుమాలోని మదీనా మిషన్ హైస్కూల్‌లో 6వ తరగతి చదువుతున్నాడు. గురువారం ఉపాధ్యాయులు 60మంది విద్యార్థులను తీసుకొని శంకర్‌పల్లి మండలం పర్వేద గ్రామ శివారులోని ఫామ్‌ఎక్సోటికా(వైల్డ్ వాటర్)కు విహారయాత్రకు వచ్చారు. వైల్డ్‌వాటర్‌లోని అలలతో కూడిన వేవ్ పూల్‌లో అడుకుంటూ నీట మునిగి స్పృహతప్పి పడిపోయాడు. వెంటనే సహచర విద్యార్థులు ప్రమాదానికి గురైన అన్సారీని బయటకి తీసుకొచ్చారు. ఫామ్‌ఎక్సోటికా సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు వెంటనే చికిత్స నిమిత్తం శంకర్‌పల్లిలోని లైఫ్‌కేర్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబీకులకు సమాచారం అందడంతో వెంటనే బాలుడి తల్లిదండ్రులు ఆసుపత్రికి వచ్చారు. విహారయాత్రకు వెళ్లిన కుమారుడి అకాల మరణంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

షాద్‌నగర్ రూరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): నడుస్తున్న రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మల్లేశ్వర్ తెలిపారు. బుధవారం అర్ధరాత్రి మహబూబ్‌నగర్ నుంచి ఉందానగర్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని రైలు నుంచి జారిపడినట్లు తెలిపారు. గ్యాంగ్‌మెన్లు గమనించి స్టేషన్ మాస్టర్‌కు సమాచారం ఇవ్వడంతో అదే రాత్రి షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 35 నుంచి 40 సంవత్సరాలు ఉంటుందని, శరీరంపై లైట్‌గ్రీన్ కలర్ షర్టు బ్లాక్‌కలర్ ప్యాంట్, వైట్ బనియన్ ఉన్నట్లు తెలిపారు. స్టేషన్ మాస్టర్ అవదేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా, మృతుడి ఆచూకీ తెలిసిన వారు 98480-90420 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

మద్యం దుకాణంలో చోరీ

- రూ.30వేలతో పాటు

రూ.10వేల విలువైన మద్యం బాటిళ్ల అపహరణ

శంకర్‌పల్లి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లిలోని మద్యం దుకాణంలో దొంగలుపడ్డారు. రూ.30వేల నగదు, రూ.10వేల విలువ గల మద్యాన్ని ఎత్తుకెళ్లారు. శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం శంకర్‌పల్లి పట్టణంలోని సింగాపురం గేటు వద్ద వెస్టుసైడ్ అనే పేరుతో రఘునందన్‌రెడ్డి అనే వ్యక్తి మద్యం దుకాణాన్ని నడుపుతున్నాడు. రోజు మాదిరిగానే బుధవారం రాత్రి దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. గురువారం ఉదయం తాళం విరగొట్టబడి ఉండటం గమనించిన పని మనిషి యజమానికి సమాచారమిచ్చాడు. రాఘవేందర్ వెంటనే దుకాణానికి చేరుకున్నాడు. దుకాణంలో రూ.30వేల నగదుతో పాటుగా రూ.10వేల విలువ గల మద్యం పోయినట్లుగా పోలీసులకిచ్చిన పిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు



మానస (ఫైల్)

శంషాబాద్ రూరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కళాశాలకు వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన సంఘటన గురువారం శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మహేశ్వరం మండలం నందిపల్లి గ్రామానికి చెందిన బండకాడి మానస(21)ను ఆమె తండ్రి నర్సింహ బుధవారం బైక్‌పై పెద్ద గోల్కొండ బస్‌స్టాప్‌లో దించి శంషాబాద్‌కు వెళ్తున్న బస్సు ఎక్కించాడు. కళాశాలకు వెళ్లిన మానస సాయంత్రం అయినా ఇంటికి రాలేదు. దాంతో కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దాంతో గురువారం శంషాబాద్ పోలీసులకు ఆమె తండ్రి ఫిర్యాదు చేశారు. అయితే, కొత్తూరు మండలం పటేల్‌గూడ గ్రామానికి చెందిన చెక్కల సందీప్ అనే యువకుడు రెండు రోజుల క్రితం మా అమ్మాయితో మాట్లాడాడని తండ్రి తెలిపాడు. ఈమేరకు అతడిపై అనుమానం ఉందని ఆయన పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు.



షాదీ ముబారక్ చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఆడబిడ్డలకు అండగా ప్రభుత్వం

చౌదరిగూడ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో గురువారం జిల్లేడు చౌదరిగూడ మండలానికి చెందిన 63 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందించారు. తహసీల్దార్ జగదీశ్వర్, ఏఎంసీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, చౌదరిగూడ, కొందుర్గు మండలాల అధ్యక్షులు రాజు, కృష్ణారెడ్డి, నాయకులు మహమ్మద్ ఇబ్రహీం, ఆంజనేయులు, చంద్రశేఖర్, సత్యనారాయణ రెడ్డి, ఎజాస్ అలీ, సలీం, బాలరాజు, గోపాల్, శివమౌళి, యాదయ్య, రజిత, యాదగిరి గౌడ్, గోబ్రియానాయక్, లింగం గౌడ్, భాస్కర్, రవి, జగన్ మోహన్, రాములు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

'ధరణి'తో మా భూములు మాయం..

'భూ భారతి'తో న్యాయం చేయండి

పంజాగుట్ట, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌తో 70 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న భూములను కొందరు కబ్జా చేశారని రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం కొండకల్ పంచాయతీలోని కొండకల్ తండా, సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం మండలం వెలిమల తండావాసులు ఆరోపించారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో గిరిజన సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ్ నాయక్, తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్, లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్ బాధిత గిరిజన రైతులతో కలిసి మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా తాము సాగు చేసుకుంటున్న భూములు కొంతమంది భూస్వాముల ఆధీనంలో ఉండేవని, అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం సీలింగ్ యాక్ట్ తీసుకురావడంతో భూస్వాములు తమ ఆధీనంలో ఉన్న వందల ఎకరాల భూములను ప్రభుత్వానికి స్వాధీనం చేసినట్లు గుర్తుచేశారు. ఆ భూములను ప్రభుత్వం నుంచి గిరిజనులు అప్పటి ప్రభుత్వ ధర ప్రకారం కొనుగోలు చేశారని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకొవచ్చిన ధరణి పోర్టల్ ద్వారా తమ భూములు సదరు భూస్వాముల పేర్లతో ఆన్‌లైన్‌లో దర్శనమిస్తున్నాయని.. ఇదే అదునుగా భావించిన వారు కబ్జాదారులుగా మారి తాము సాగు చేసుకుంటున్న భూముల నుంచి తమను గెంటివేశారని ఆరోపించారు. దాదాపు 250 కుటుంబాలు 600ఎకరాలు కబ్జా కోరల్లో చిక్కుకున్నాయని, ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ పార్టీ.. అసెంబ్లీలో భూభారతి చట్టాన్ని ఆమోదించడంతో తిరిగి మరోసారి తమకు భూములపై ఆశలు చిగురించాయని అన్నారు. వెంటనే భూభారతి చట్టంతో తమ భూములను తమకు ఇప్పించాల్సిందిగా బాధితులు సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పలువురు బాధిత రైతులు పాల్గొన్నారు.